క్లుప్తంగా

విధుల్లో అలసత్వం వద్దు
సిబ్బందికి జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశం



నగరంపాలెం: నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ కాలి నడకన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐ, సిబ్బందితో మాట్లాడారు. రాత్రి విధుల్లో తప్పనిసరిగా వేలిముద్రల పరికరాలతో గస్తీ నిర్వహించాలని సూచించారు. విధుల్లో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. నేరాలు జరిగే ప్రాంతాల్లో పెట్రోలింగ్ మరింతగా పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ప్రయాణికులతో మాట్లాడారు. ఎక్కడ నుంచి వస్తున్నారు....ఎక్కడకి వెళుతోంది? తెలుసుకున్నారు. ఎస్పీ వెంట పాత గుంటూరు పీఎస్ సీఐ సుబ్బారావు, లాలాపేట పీఎస్ ఎస్ఐ అమర్‌వర్ధన్ ఉన్నారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం



పట్నంబజారు: ప్రజల సమస్యల్ని సత్వరం పరిష్కరిస్తామని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల తెలిపారు. ఆమె శుక్రవారం 7వ డివిజన్ పరిధిలోని బెస్తపేటలో పర్యటించారు. రూ. 25లక్షలతో చేపట్టిన తాగునీటి పైపులైను, యూజీడీ, సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్డు పనుల్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, కిశోర్, సుధాకర్, ప్రసాద్, మౌలాలి, చంద్రమౌళి, జీఎంసీ అధికారులు పాల్గొన్నారు. ముందుగా కొత్తపేటలోని గౌడీయ మఠంలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త మునిమహారాజ్‌ను దుశ్శాలువతో సత్కరించారు.

ఆంజనేయ చౌదరికి నటభాస్కర బిరుదు ప్రదానం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై శుక్రవారం సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నీరెన్ రావెల 'జ్వరాలు– అంటురోగాలు' అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం ద్విభాషా హరికథ తపస్వి తుర్లపాటి శంభయాచారి నెలకొల్పిన నటభాస్కర బిరుదును ప్రముఖ రంగస్థల నటుడు గుంటుపల్లి ఆంజనేయ చౌదరికి అందజేసి ఘనంగా సత్కరించారు. సభలో ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, గోనుగుంట శేషగిరిరావు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియం వేదికగా ఆదివారం తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు కళాలయ మెలోడీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ.వి. రత్నాజీ తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

గౌడీయ మఠంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పట్నంబజారు: శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా నగరంలో పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. గుంటూరువారితోటలోని గౌడీయ మఠంలో జరిగిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని వేడుకలతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఆలయ ధర్మకర్త ముని మహరాజ్‌ను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు కాలనీల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రయాణికుల ప్రాణాలు.. గాలిలో దీపాలు

- నిబంధనలు బేఖాతరు
- ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం
- గూడ్స్ ఆటోల్లోనూ ప్రయాణికుల తరలింపు
- ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ల నుంచి ప్రారంభం
- చోద్యం చూస్తున్న ఆర్టీవో, ట్రాఫిక్ అధికారులు



రైల్వేస్టేషన్ రోడ్డులో గూడ్స్ ఆటోలో ప్రయాణికుల తరలింపు

పట్నంబజారు: గూడ్స్ ఆటో డ్రైవర్లు నిబంధనల్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి ప్రయాణికుల్ని తరలిస్తున్నారు. పట్టించుకోవాల్సిన రవాణా శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రయాణికుల్ని సరుకుల్లా తరలిస్తున్నా, నగరంలో యథేచ్ఛగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిస్తున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఆటో యూనియన్ల నుంచి మామూళ్లు అందుతుండటంతో పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 29,760 ఆటోలు ఉన్నాయి. వాటిలో 8,400 గూడ్స్ ఆటోలు కాగా, 21,360 ప్రయాణికుల్ని ట్రాన్స్‌పోర్ట్ చేసేవి ఉన్నాయి. సుమారు 15వేల వరకు ఆటోలు (వేరే జిల్లాల్లో రిజిస్ట్రేషన్ జరిగనవి కూడా) గుంటూరు కేంద్రంగా తిరుగుతున్నాయి. వీటిలో 200పైగా టాటా మ్యాజిక్, 1,000పైగా అప్పే ఆటోలు తెనాలి, నందివెలుగు, మంగళగిరి, అమరావతి, పొన్నూరు, పేరేచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేటతో పాటు పలు ప్రాంతాలకు తిరుతున్నాయి. నగరంలో సుమారు 13వేల దాకా ఐదు సీటింగ్ ఆటోలు కెపాసిటీకి మించి తిరుగుతుంటాయి. కళ్ల ముందే ఆటోవాలాలు కనీస నిబంధనలు పాటించకుండా తిరుగుతున్నప్పటికీ ఆర్టీవో, ట్రాఫిక్ అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్టీసీ ఆదాయానికి గండి

నిబంధనలు బేఖాతరు చేస్తున్న ఆటోవాలాల తీరుతో ఆర్టీసీకీ ఆదాయానికి గండిపడుతోంది. బస్టాండ్ సమీపంలోని ప్రయాణికుల్ని ఎక్కించుకుని ఇతర ప్రాంతాలకు తీసుకు వెళుతున్న పరిస్థితులున్నాయి. బ్రహ్మానందరెడ్డి స్టేడియం, ఉల్ఫ్ హాల్ గ్రౌండ్స్, పల్నాడు బస్టాండ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్, లాడ్జి సెంటర్ తదితర ప్రాంతాల్లో అడ్డగోలుగా ఆర్టీసీ బస్‌స్టాప్‌ల వద్దే ప్రయాణికుల్ని బస్సులకు అడ్డుపెట్టి మరీ ఎక్కించుకుని వెళుతున్నారు. పట్టించుకోవాల్సిన ఆర్టీవో అధికారులు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించకుండా, అధిక పరిమితి, గూడ్స్ ఆటోల్లో ప్రయాణం, ఆర్టీసీ బస్‌స్టాప్‌ల వద్ద ప్రయాణికుల్ని ఎక్కించుకోవడాన్ని నిలువరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇష్టానుసారంగా ప్రయాణం

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఆటోల్లో ప్రయాణికుల్ని ఎక్కించుకుని తిరగకూడదని స్పష్టమైన నిబంధనలున్నాయి. అయితే, ఆయా ప్రాంతాల నుంచి వచ్చే కూలీలు, పలు శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాల నుంచి వచ్చే వారిని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ల నుంచే తరలిస్తున్నారు. పట్టపగలే నగరంలో నుంచి ఇతర ప్రాంతాలకు గూడ్స్ ఆటోల్లో ప్రయాణం చేస్తున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా నగరంలో టాటా మ్యాజిక్ ఆటోలు అమరావతి, తెనాలి, నందివెలుగు ప్రాంతాలకు తిరుగుతున్నాయి. అయితే, ఇవి కూడా పరిమితికి మించి ప్రయాణికుల్ని ఎక్కించుకుని తిరుగుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్స్, లాడ్జి సెంటర్ నుంచి పరిమితికి మించి ప్రయాణికులతో, కనీస వేగ నియంత్రణ కూడా లేకుండా తిరుగుతున్నాయి. ఈ ఆటోల్లో అధికంగా డ్రైవింగ్ లైసెన్స్ వారు ఉంటున్నారని తెలుస్తోంది.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ఆటోవాలాలు వ్యవహరిస్తున్న తీరుతో గుంటూరు నగరంలో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలుగుతోంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇన్, అవుట్ గేటు వద్ద రోడ్డుపైనే ప్రయాణికుల్ని ఎక్కించుకునేందుకు ఆపడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో పాటు నందివెలుగు రోడ్డులోని బస్టాండ్ అవుట్ గేట్ వద్ద ఆటోలు రోడ్డుపై అడ్డంగా నిలిపివేస్తున్నారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పల్నాడు బస్టాండ్ సెంటర్, నాజ్‌సెంటర్, శంకర్‌విలాస్‌తో పాటు ముఖ్య కూడళ్లలో ఆటోవాలాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు.

తనిఖీలు చేపడతాం



జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టి, నిబంధనలు పాటించని ఆటోవాలాలపై చర్యలు తీసుకుంటాం. గూడ్స్ ఆటోల్లో ప్రయాణికుల్ని తరలిస్తే.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. దీనితో పాటు బస్‌స్టాప్‌ల వద్ద ఆటోలు నిలవరించి ప్రయాణికుల్ని ఎక్కించుకున్నా.. పరిమితి మించి ఆటోలో ఉన్నా కేసులు నమోదు చేసి, సీజ్ చేస్తాం. ఆటో యజమానులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలి.

– షేక్ కరీం (డీటీసీ, గుంటూరు జిల్లా)





పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోలు

తెలుగు చిత్రసీమలో సాటిలేని మేటి నటి భానుమతి



భానుమతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంస్థ కార్యదర్శి శివరామిరెడ్డి, సభ్యులు

లక్ష్మీపురం: తెలుగు చలన చిత్ర రంగంలో సాటిలేని మేటి నటి భానుమతి రామకృష్ణ అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో పాడుదాం రండి సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం సినీ నటి భానుమతి జయంతి వేడుకల్ని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు చిత్రసీమలోనే కాదు యావత్ భారతంలోనే భానుమతి వంటి బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన నటి మరొకరు లేరని తెలిపారు. చిత్రసీమలో ఆమె ఖ్యాతి నిరంతరం వెలుగుతూనే ఉంటుందని పేర్కొన్నారు.

మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి, విశ్లేషకులు ఎన్.సదాశివం మాట్లాడుతూ భానుమతి నటిగా, గాయనిగా, నర్తకిగా, రచయిత్రిగా, దర్శకురాలిగా, నిర్మాతగా కొనసాగిన తీరు అనితర సాధ్యమని కొనియాడారు. అనంతరం భానుమతి నటించిన చిత్రాల్లోని గేయాల్ని పలువురు ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఆరోగ్య సభ

అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహించనున్నట్లు కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. ఈ ఆరోగ్య సభలో ప్రభుత్వ సమగ్రాసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.ప్రభావతి ప్రధాన వక్తగా పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ



గంటాలమ్మ చెట్టు వీధి శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వ్రతం చేస్తున్న మహిళలు



అరండల్‌పేట అష్టలక్ష్మి ఆలయంలో....

పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పూజలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.





ఆర్. అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి వ్రతం చేస్తున్న మహిళలు



అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పూజలు

నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకించండి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నెహ్రూనగర్: నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు తెలిపారు. రివల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 2020 నూతన జాతీయ విద్యా విధానం.. విద్యా రంగంపై ప్రభావం అనే అంశంపై శుక్రవారం ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన అంబేడ్కర్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ నూతన విద్యా విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యను వ్యాపారంగా చేసిందని తెలిపారు. విద్యార్థుల ప్రవేశాలలోనూ, ప్రభుత్వ విద్యా సంస్థలోనూ, ఉద్యోగావకాశాల్లోను రిజర్వేషన్లు నిరాకరిస్తోందని విమర్శించారు. పదోన్నతుల్లో చివరికి విద్యార్థతల్ని సైతం పక్కన పెట్టి అధికారులు ఇష్టానుసారంగా ఇచ్చుకునే పరిస్థితిని కల్పిస్తోందని ధ్వజమెత్తారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నూతన విద్యా విధానం ద్వారా ప్రభుత్వ విద్యకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు దూరమయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రశాంత్, రాజు, అవినాష్, నాగేశ్వరరావు, మణికంఠ, చరణ్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయం ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం
అడ్డుకున్న పోలీసులు

గుంటూరు ఈస్ట్: ఓ మహిళ కుమార్తెతో కలసి ఎస్పీ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పాత గుంటూరు కొండలరావునగర్‌కు చెందిన ఇక్కుర్తి పద్మావతి భర్త పవన్‌కుమార్ మూడేళ్ల క్రితం మృతిచెందాడు. సమీప బంధువు ఇంటి కింద అంతస్తులో కుమార్తె సాయితో కలసి నివాసం ఉంటోంది. పై అంతస్తులో మరిది కిరణ్, తోడికోడలు స్వాతి నివాసం ఉంటున్నారు. వృద్ధురాలైన అత్తను రెండు కుటుంబాలు చూడడం లేదు. దీంతో భవన యజమాని మదలించాడు. తల్లిని సరిగా చూసుకోవాలని కోరాడు. పద్మావతికి, కిరణ్‌కు ఇటీవల చిన్న గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో పద్మావతి శుక్రవారం ఎస్పీ కార్యాలయం ఎదుట నిలబడి తన కుటుంబానికి ప్రాణహాని ఉందంటూ ఒంటిపై పెట్రోలు పోసుకుని, కుమార్తె సాయి ఒంటిపై చల్లింది. అప్రమత్తమైన పోలీసులు అడ్డుకుని నగరంపాలెం స్టేషన్‌కు తరలించారు. పద్మావతి గతంలో అత్తంటివారు తనను వేధిస్తున్నారంటూ రెండుసార్లు పాత గుంటూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. సులు కేసు నమోదు చేశారు.

కోవిడ్ ఫైటర్స్‌కు గవర్నర్ అభినందనలు



గుంటూరు మెడికల్: గుంటూరు కోవిడ్ ఫైటర్స్ ట్రస్టు సభ్యుల్ని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఈనెల 7న రాజభవన్‌లో ఆయన చాంబర్‌లో అభినందించారు. గుంటూరు కోవిడ్ ఫైటర్స్ సేవా కార్యక్రమాలు బాగున్నాయని, వాటిని కొనసాగించాలని సూచించారు. యువకులు స్వచ్ఛందంగా చేస్తున్న సేవకు గవర్నర్ అభినందనలు తెలిపి, వారిని ప్రోత్సహించడం సంతోషంగా ఉందని ట్రస్టు వ్యవస్థాపకుడు పఠాన్ అల్లాబక్షు తెలిపారు. స్వయంగా గవర్నర్ కార్యాలయం నుంచి తమకు ఆహ్వానం వచ్చిందని, ఆయన అభినందనలతో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేస్తామని పేర్కొన్నారు.

ఒంటరితనం, ఒత్తిడే ఆత్మహత్యలకు కారణం



డాక్టర్ కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నర్సింగ్ కళాశాలల సిబ్బంది

గుంటూరు మెడికల్: సమస్యలు వచ్చినప్పుడు తోడు లేకపోవడం వల్లే అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. గోరంట్లలోని ప్రభుత్వ మహిళా నర్సింగ్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణపై దినోత్సవం సందర్భంగా వర్క్‌షాప్ నిర్వహించారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో అంతా కలసి ఉండటంతో ఆత్మహత్యలకు పాల్పడేవారు కాదన్నారు. నేడు పలువురు ఒంటరితనంతో పాటు ఒత్తిడి, అపజయాల్ని తట్టుకోలేక మానసికంగా కుంగి పాల్పడుతున్నట్లు చెప్పారు. యువత ఆత్మహత్యలకు ఏవిధంగా ప్రేరేపించబడుతున్నారో ఆయన వివరించారు. వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బోధన సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులకు వివరించారు. అనంతరం డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ నర్సింగ్ విభాగం డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.వల్లి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధ రమణిశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పద్మావతి, ఎమ్మెస్సీ నర్సింగ్ విద్యార్థులు సిమ్స్, సిస్టర్ కేర్, ఎన్నారై, ఏఎస్ఆర్ నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్ల విస్తరణ తప్పనిసరి

మేయర్ కావటి



టీడీఆర్ బాండ్లు అందజేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. పెదపలకలూరు రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన పలకలూరు రోడ్డులోని రత్నగిరినగర్ వాసులకు శుక్రవారం టీడీఆర్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గుంటూరు నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు, పాలకవర్గం విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. నగరంలో ఇప్పటికే రామనామ క్షేత్రం రోడ్డు, కొత్తపేట శివాలయం రోడ్డు, ఏటీ అగ్రహారం రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తరణ పూర్తయిందని పేర్కొన్నారు. పెదపలకలూరు రోడ్డు విస్తరణ వల్ల నగర ప్రజలతో పాటు నరసరావుపేట వెళ్లే వాహనాలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. తద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని చెప్పారు. విస్తరణలో ప్రభావితం అవుతున్న నిర్మాణాలకు నష్టపరిహారం అందజేశామని తెలిపారు. స్థలం కోల్పోతున్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే పెదపలకలూరు రోడ్డులో సైడు కాల్వల నిర్మాణం పూర్తయ్యిందని, సెంటర్ డివైడర్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా ఆర్ అండ్ బీ అధికారులతో చర్చిస్తామని మేయర్ చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఏసీపీ అజయ్ కుమార్, స్థానిక పెద్దలు పసుపులేటి పూర్ణచంద్రరావు, కటారు శ్రీధర్, కటారి శ్రీను, నరసింహారావు, సచివాలయాల కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: నగరంలో వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. కొండా వెంకటప్పయ్య కాలనీకి చెందిన ఉమ్మడి వెంకట్రావు (50) అప్పుల పాలయ్యాడు. మానసికంగా కుంగిపోయి శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- భారతపేట 3వ లైనులో నివసించే వనమా ప్రసాద్ (40) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఆలస్యంగా గుర్తించిన భార్య అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ రాజశ్యామలాదేవిగా భ్రమరాంబిక దర్శనం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబికా సమేత శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లు విశేష అలంకరాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామికి విశేష అభిషేకాల్ని నిర్వహించారు. నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ రాజ శ్యామలాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ఆలయ ప్రధానాచార్యక స్వామి చంద్రశేఖరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోలాట నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి



ప్రథమ బహుమతి అందుకున్న నృత్యకారుణులు

గుంటూరు ఎడ్యుకేషన్: కృష్ణాష్టమి పురస్కరించుకుని సంస్కార భారతి ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన కోలాట నృత్య పోటీల్లో అను డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణుల బృందం ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నారు. గురువారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్రప్రభు, తులసి యోగీష్‌చంద్ర, శాస్త్రవేత్త చందు సాంబశివరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాట్య గురువు అను పాల్గొన్నారు.